# భూమి లేచిపోయింది




ముదిగంటి సుజాతారెడ్డి

**“అ**మ్మా ! ఈరోజు స్కూలుడే గద నేను వచ్చేవరకు పొద్దు పోతది” - అని తల్లికి చెప్పుకుంట విమల చెప్పులేసుకొని బ్యాగు తీసుకొని చేతికి గడియారం బిగించుకుంట బయటికి నడిచింది. ఎదురుగా పక్కింటి నారాయణ కన్పించాడు.

“ఏందన్న పొద్దున్నే బయదెల్లినవ్?” అడిగింది విమల. నారాయణ పక్కనున్న వ్యక్తి ఎవరన్న ప్రశ్న ఆమె కండ్లలో కన్పించింది.

“ఏం లేదమ్మ ! ఇగో గీయన ప్లాట్ల బేరం జేస్తుండు. నువ్వో ప్లాటు కొంటవేమోనని వెంటబెట్టుకొని వచ్చిన.” అన్నాడు నారాయణ

అక్కడ వరండాలో వున్న ప్లాస్టిక్ కుర్చీలో కూలబడుతూ మరో కుర్చీని ఆ వ్యక్తిని కూర్చోమన్నట్లుగా ముందుకు లాగాడు.

స్కూలుకు పోయేటైమవుతున్నది. స్కూలు టైం కన్నా గంట ముందు బయలుదేరితే గాని తాను బస్సు దొరికి స్కూలుకు టైమ్‌కు చేరుకోగలుగుతుంది. కొంచెం ఆలస్యం చేస్తే బస్సు స్టాప్‌లో ఆఫీసు పోయే వాళ్ళు పోగవుతారు. బస్సులు కిక్కిరిసి వస్తాయి. ఏ బస్సు స్టాపులో ఆగకుండా ముందుకు దూసుకు పోతుంది. ఆఖరికి టైం అయిపోతున్నదని ఆటోలో పోవలసి వస్తుంది. ఆటోలో పోతే డబ్బు ఖర్చు. ఆటోలో కూర్చున్న కొన్ని క్షణాలకే మీటరు పరిగెత్తటం ప్రారంభమవుతుంది. అంత డబ్బు పోయటం కన్నా కొంచెం ముందే బస్సు స్టాపు చేరుకొని బస్సులో పోవటం నయం. ఈరోజు దారి కడ్డంగా పిల్లి లెక్క ఈ నారాయణ వచ్చాడు ! – మనస్సులోనే విసుక్కుంది విమల. పొద్దున్నే ప్లాట్ల బేరమంట వచ్చాడు ! ప్లాటా !..... ఒక్కదాన్ని నాకెందుకు ప్లాటు? ఈ జంజాటం?" అంది విమల పేలవంగ నవ్వుతు.

"గట్లంటవేందమ్మ ! ఒక్కదానివైతే ఏంది ! ప్లాటు కొనుక్కోవద్దా? ఇల్లు కట్టుకోవద్దా ? రేపు రిటైరయినంక నీ సొంత ఇల్లు కట్టుకొని అండ్ల ప్రశాంతంగ వుండు. నీ చెల్లెలుంది. నువ్వు పెండ్లి జేసుకోనని చేసుకోలేదు గాని గామె పెండ్లయింది గద. నీ చెల్లెలుకు మొగోడి లెక్క నిలబడి పెండ్లి జేసింది ఎవరు? నువ్వే గద ! ఆమెకు పిల్లలున్నరు. ఆ పిల్లలెవరు ?నీ పిల్లలు గారా ? నిన్ను జూసేటందుకు నీ కాడికి రారా? నాలుగు రోజులుండరా! అప్పుడు నీ ఇల్లు నీకంటూ వుంటె ఎంత మంచిగుంటది ! అవునా గాదా చెప్పు? ప్లాటు తీస్కో తక్కువలో వస్తున్నది. పట్నం శివార్లలో ఇగో గీ పరశు రాం – ప్లాట్లు చేసి ఇన్‌స్టాల్ మెంట్ల లెక్క అమ్ముతున్నడు. నువ్వొక్క పాలి కట్టాలన్న బరువు లేదు. నెలకు ఐదొందలు కట్టిన వంటె వంద




గజాల భూమి ఐదేండ్లకు నీ పేర రిజిస్ట్రేషన్ జేస్తడు. భూమి వుంటె ఎక్కడికి పోతది ! లేచి పోదు గద ! – "మధ్యలో ఆగి పెద్దగ నవ్విండు నారాయణ. పక్కన నిశ్శబ్దంగా కూర్చొని వున్న పరుశురాం అవునన్నట్లుగ తలూపిండు.

"ఏందమ్మ ! గట్ల మొఖం పెట్టినవు. అన్నీ గాయనే చూసుకుంటడని చెప్పిన గద. నువ్వు పైసలు తప్పకుంట నెల నెల కట్టు బస్ ! గంతే ! భూమి నీదయితది. నీ భూమి నీకు గక్కడ పడి వుంటది. ఫికర్ జేసే అక్కరే లేదు. నిమ్మలంగ రిటరయినంక వచ్చే పైసల్తోటి ఇల్లు కట్టుకో ! నీ జాగల నువ్వు నీ ఇంట్ల నువ్వు ఏ పరేషాన్ లేకుంట సుఖంగ వుండొచ్చు !" వివరంగ చెప్పిండు నారాయణ.

విమల వెనుకనే బయటికి వచ్చిన తల్లి శాంతమ్మ నారాయణ మాటలు వింది.

"విమలా ! నారాయణ చెప్పే మాటలు మంచిగనే వున్నయి. నెలకింత కట్టినవంటె భూమి నీదయితది. అక్కడ పడి వుంటుంది. దాన్నెవడు ఎత్తుకపోడు. ఇష్టముంటె ఇల్లు కట్టుకోవచ్చు లేదంటె అమ్ముకోవచ్చు. పెండ్లి చేసుకోనని మొండిపట్టు పట్టివి. ముందల ముందల నీ కంట గింత ఆస్తి వుంటె నీ చెల్లెలో దాని పిల్లలో ఆశపడి నీకు ఆసరైతరు. భూమి వుంటె ఎక్కడికి పోతది?" అంది శాంతమ్మ.

విమల కొంచెం సేపు మౌనంగ వుండి పోయింది. ఆలోచనలో మునిగిపోయింది – "నిజమే ! భూమి వుంటె ఎక్కడికి పోతది ! నెలనెల జీతంల నుంచి ఐదొందలు కట్టటమంటే ఏమంత తిప్పలు కాదు – అనుకుంది విమల.

"ఏందమ్మ ! గంత ఘనం ఆలోచిస్తవే! నీ ఇంటికి వచ్చి నెల నెల గీ పరుశురాం రసీదిచ్చి పైసలు తీస్కపోతడు. నువ్వు ఆఫీసుకు పోవాలె కట్టాలె అని సుత లేదు. ఐదేండ్లయినంత నీ పేర జేస్తడు. అంతనే కడుపుల చల్ల కదలకుంట అయితది. ఐదేండ్ల ఎంతల అయి పోతయి ! చూస్తుండంగనే నీ పేర వంద గజాలు రిజిస్ట్రేషను జేస్తడు పరుశురాం." అన్నడు నారాయణ. అవునన్నట్లుగ పరుశురాం మల్ల తలూపిండు.

ఆలోచిస్తుంటే ఆలోచిస్తుంటె విమలకు వాళ్ళ మాటలు బాగానే వున్నాయనిపిస్తున్నయి. పరశురాంను మర్నాడు రమ్మంది పైసలు తీస్కునేటందుకు. నారాయణ పరుశురాం వెళ్ళిపోయారు. విమల "ఇగ యీ రోజు ఆటోలోనే పోవాలె తప్పదు" అనుకుంట దబదబ బయటికి నడిచింది.

పరశురాం ప్రతినెల వచ్చి డబ్బు తీస్కొని రసీదు ఇస్తున్నాడు. విమల కూడా రేపురా ఎల్లుండిరా అనకుండా టైమ్‌కు డబ్బు ఇచ్చేస్తున్నది. పరశురాం బలవంతం మీద విమల ఒకరోజు స్థలాన్ని చూడడానికి పోయింది. పరశురాం తన స్కూటరు మీదనే విమలను తీస్కపోయి పట్నానికి పదిమైళ్ళ దూరంలో గుండ్లారం గ్రామం దగ్గరున్న స్థలాన్ని చూపించిండు. చుట్టుపక్కల యేం ఇండ్లు గాని కట్టడాలు గాని లేవు. నిర్జన ప్రదేశం. జాగా అంతా గుండ్లు రాతి బండలతో నిండి వుంది. ఆజాగాలో ప్లాట్లు చేసిన గుర్తు లుగా తెల్లరాళ్ళు అక్కడక్కడ పాతి వున్నాయి. పెద్ద రాతి గుండు పక్కనున్న భూమిని చూపిం చిండు పరశురాం. "మ్యాడమ్! ఇగో గిదే మీభూమి. వంద గజాలుంటది" అన్నడు.

విమల దిగులుగా చుట్టూ చూసింది.

"ఇదేంటి? నిర్జన ప్రదేశం ! ఇదేం భూమి !"

అనుకుంది. ఆమె కండ్లల్లో దిగులు నిరాశలను చూసాడేమో పరశురాం.

"మీరేం ఫికర్ పెట్టుకోకుండ్రి మ్యాడమ్! రెండేండ్లలో అగో గక్కడ జూడండ్రి పని నడుస్తున్నది. గక్కడ అమెరిక వాళ్ళది కంప్యూటరు కంపెనీ వస్తది.ఐదేండ్లల్ల జూడండి ఇక్కడన్ని ఇండ్లే ఇండ్లు అయితయి. గప్పుడు జూడండ్రి గిక్కడ జాగ కావాల్నన్న దొరకదు. బంగారమై పోతది భూమి ! మీరేం బుగులు పెట్టుకోకుండ్రి మ్యాడమ్ !" అన్నడు పరశురాం.

పరశురాం మాటలు విన్నా విమలను ఆవరించిన నిరాశ వదలలేదు. ఆమె ముఖం చిన్నబోయింది. "ముప్పై వేల రూపాయలకు వంద గజాల భూమి ! భూమి వుంటె ఎక్కడికి పోతదిలే పడి వుంటది" మనస్సుకు ఊరట చెప్పుకొని నిట్టూర్చింది విమల.

ఏమో ఎవరికి తెలుసు ! పరశురాం అన్నట్లుగ ఈ భూమి ధర రేపు ఆకాశాన్నంట వచ్చును. ఇప్పుడు జూబ్లీ హిల్స్‌లో చూస్తలేదు? అక్కడ ఎవరనుకున్నరు అట్ల అభివృద్ధి జరుగుతుందని ! నాన్నగారి ఆఫీసువాళ్ళు అక్కడ ప్లాట్లు చేసి గజానికి నాలుగణాలే అన్నా నాన్నగారు ఆ అడవిలో గుట్టల్లో నాకెందుకు భూమి అని తీసుకోలేదు. అట్లనే ఇక్కడ అభివృద్ధి జరుగుతుందేమో !" మెల్లగా విమలలో సంతోషం చిగురించింది. నిశ్శబ్దంగా మళ్ళా నిట్టూర్చింది. ఆమెలోని అనుమానాల మేఘాలు విడిపోయాయి. నా సొంతం అన్న భూమి కొంత ఇక్కడ వుంది కద ! – అన్న ఆనందంతో చుట్టూ చూసింది. చల్లగా వీచే పిల్లగాలులు ఆమె ముఖాన్ని తాకాయి. ఈ భూమి నా సొంతం ! ఈ గాలి నా సొంతం ! – ఆమె గుండెల నిండా గాలి పీల్చుకుంది. సంతృప్తితో చిరునవ్వు నవ్వింది. ఆనందంతో పరశురాం స్కూటరు వెనుక సీట్లో కూర్చుంది.

ప్రతి నెలా విమల ఐదొందలు కడ్తూ పోయింది. ఇంతకుముందు కన్నా ఉత్సాహంతో ఆనందంతో చెల్లించింది. అట్లా ఐదేండ్లు ఎప్పుడు గడచిపోయాయో ఆమెకు తెలియనే లేదు. ఐదేండ్లు పూర్తి అయ్యాయి. విమల ఆఖరి ఇన్‌స్టాల్‌మెంటు ఇచ్చింది. రిజిస్ట్రేషను కోసం ఎదురు చూడటం మొదలుపెట్టింది. ఆఖరి ఇన్‌స్టాల్‌మెంట్ తీసుకున్న పరశురాం రిజిస్ట్రేషన్ కాగితాలు పట్టుకు వస్తానని చెప్పి పోయినవాడు తెల్లవారి రాలేదు. మర్నాడు రాలేదు. ఆ మర్నాడు రాలేదు. రోజులు వారాలు నెలలూ గడచిపోయాయి. ప్రతి నెలా టైమ్‌కు వచ్చే పరశురాం మొఖమే మళ్ళా కనిపించలేదు.

పక్కింటి నారాయణను అడుగుదామంటే ఆయన సొంత ఇల్లు కట్టుకొని ఎక్కడో దూరంగా కాలనీకి తరలివెళ్ళిపోయిండు. అతనితో సంబంధమే తెగిపోయింది. ఏం చేయాలో ఎవర్ని అడగాలో విమలకు అర్థం కాలేదు. స్కూల్లో విమల ఇన్‌స్టాల్‌మెంట్లు కట్టిన విషయం విన్న తోటి టీచర్లు ఏవేవో తలా ఒక ముచ్చట విన్పించారు. అంతా మోసం దగా ప్లాటు గురించి మర్చిపో అన్నారు. అదంతా వింటే విమల గుండె దడదడలాడింది.

ఒకరోజు విమల ఆటో తీసుకొని తను కొన్న భూమిని చూసైనా వద్దామని గుండ్లారం బయలుదేరింది. అప్పుడు ఐదేండ్ల కింద తను చూసినప్పుడు నిర్జనంగా వున్న జాగా రూపమే మారిపోయింది. అక్కడ రాతిబండలు గుండ్లు లేనే లేవు. వాటి జాగాలో చక్కని గ్రానైట్‌తో కట్టిన మేడలు కన్పించాయి. తన ప్లాటు అని చూపించిన పెద్ద రాతి గుండును వెతుక్కుంటూ పోయింది విమల. ఆ రాతిగుండు పక్కన ఒక పెద్ద భవనం కన్పించింది ఆమెకు. ఆ భవనం దగ్గరికి పోయి నిలబడ్డది. భవనం చుట్టూ ఎత్తైన గోడలు పెద్ద ఫాటకులు కన్పించాయి. లోపలికి పోయి ఆ భవనమెవరిదో కనుక్కుందామని విమల నల్లని ఎత్తైన ఫాటకుల ముందు నిలబడింది. మెల్లగా ఫాటకులను తోసింది. కొద్దిగా తెరుచుకున్నాయి. విమల పక్కగా తిరిగి లోపలికి దూరింది. అంతే ! –

భౌ ! భౌ ! – అని కుక్కల అరుపులు విన్పించాయి. కౌన్ హై ? – అని కర్కశంగా అరుస్తూ గుర్ఖా చేతిలో లాఠీతో ఆమె ముందు ప్రత్యక్షమయ్యాడు. విమల బెదిరిపోయింది. నోట్లో నుంచి మాట పెగలలేదు. కాని వెంటనే తనను తాను సంబాలించుకొని "ఈ మేడ ఎవరిదండి?" అని అడిగింది మంద్ర స్వరంలో విమల నోరు పెదవులు తడి ఆరిపోతున్నాయి.

"సాబ్ నహేఁ! చలే జావో !" అరిచాడు గుర్ఖా. విమల మేడవైపు చూసింది. పాలరాతితో పరచిన దారి పాలనురుగులు కక్కుతున్నది. అక్కడ తనఅడుగులు పడితే జారిపోతాయేమో! – భయంతో విమల అడుగులు వెనకకు పడ్డాయి. గేటుకు అటు ఇటు చూసింది. గేటు దిమ్మె మీద అస్తమించే సూర్యకిరణాలు పడి బంగారం రంగుతో అక్షరాలు జిగేల్‌మన్నాయి – "పరశురాం" అని విమల కండ్లు చదివాయి.

ఆ పేరు చూడగానే విమల తల గిర్రున తిరిగింది. చక్కరు వచ్చి కింద పడి పోతానేమో ననుకుంది. పెద్దగ అరవాలని పించింది ! అరిస్తే తనకు పిచ్చి లేచిందని రోడ్డుమీద పోయే జనం అనుకుంటరేమో అని భయంతో ముదుచుకు




వి. త్రివేణి రచించిన తూనీగలు (నానీలు), చిల్లరిగె స్వరాజ్యలక్ష్మి కవిత్వ పరిశీలన (ఎం.ఫిల్ లఘుసిద్ధాంత వ్యాసం) అనే గ్రంథాలను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్య ఎన్.గోపి ఆవిష్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో డా॥ మసన చెన్నప్ప, తెలంగాణ యూనివర్శిటీ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ కె.ఎల్.ఎన్.స్వామి, కవయిత్రి త్రివేణి, నానీల ఆదికవి గోపి, తెలుగు శాఖాధిపతి ప్రొ॥పి. సుమతీ నరేంద్ర, డా॥ముదిగంటి సుజాతారెడ్డి, డా॥చిల్లర భవానీదేవి ఉన్నారు.

పోయింది విమల. నిస్సహాయంగా అక్కడ్నుంచి కదిలింది. మెల్లగా భయం స్థానంలో కోపం ఉబికింది. కోపంతో కేకలేస్తూ పరశురాంను తిట్టాలనిపించింది. కాని విమల నోరు పెగలలేదు. మెల్లగా అడుగులేసుకుంటూ పోయి ఆటోలో కూలబడింది. "చలో! వాపస్ చలో !" అంది. ఆటో కదిలింది. ఆటో దూసుకుపోతున్నది. విమల దుఃఖం ఆగలేదు. వెక్కి వెక్కి ఏడ్చింది. తన కష్టార్జితం దోపిడి అయింది. అట్లఎంతమంది కష్టార్జితాలను పరశురాం మింగిండో ! ఈ మోసం దోపిడి దగాను గురించి ఎవరికి చెప్పుకోవాలె ! ఎవరు న్యాయం చేస్తారు ! తను కొన్న భూమి ఇక లేదు. లేచిపోయింది ! - వెక్కి వెక్కి ఏడ్చింది విమల.


**నినుకు మాసపత్రిక**

చదవండి! చదివించండి!

చందాదారులు కండి!

సంవత్సర చందా రూ. 120/-

విశిష్ట సభ్యత్వం రూ. 3000 /-


# కను కొలకల నుండి రగులుతున్న అగ్గి

తెల్లవారు జామున
కురుస్తున్న మంచువానకు
ఆ గుబురు చెట్టంతా తడిసింది.
నా రెండు చేతులతో దాన్ని కదిపాను
అంత తడిలో కూడా ఒక సువాసన
నన్ను కదిలించింది.
అవును కొన్ని చిరునవ్వులు
చల్లగా, మృదువుగా వుంటాయి
ఎంతో సంభాషణకు సమాధానంగా
ఒక్క చిరునవ్వు అనంత కావ్యాలను
మనకు వినిపిస్తుంది.
ఆధిపత్యం పెరుగుతున్న చోట
వివేచన తరుగుతుంది.
ఆ కొండల మధ్య రెండు జింకలు
పచ్చికలో నిర్భయంగా
తలయెత్తి చూస్తున్నాయి
బెరుకు లేని తావులో
ఏ జీవైనా స్వేచ్ఛ ననుభవిస్తుంది కదా !
కొండల మధ్య పారే ఆ యేరు
నిర్భీతిగా సాగుతుంది.
మందారాల రంగులోని
అద్దాల పావడా ధరించిన లంబాడీ స్త్రీ
ఇంతవరకూ స్వేచ్ఛగానే జీవించింది
ఎవరో పిస్తోలుతో
ఆ చెట్టు మీది గువ్వలను
గాయపరుస్తున్నారు
ఎండుటాకులను
తొక్కుకుంటూ పోతున్న ఇనుప పాదాలు
చిగురుటాకులను కూడా చిదుముతున్నాయి
ప్రకృతి వికసించిన చోట
దృశ్య చిత్రాలు తీయబడుతున్నాయి
ప్రకృతి విలవిలలాడిన నెలవులో
చిత్రం కనుమరుగు అవుతుంది
ముళ్ళతో చీల్చబడిన గొంతు నుండి వచ్చిన కేకలు
మబ్బులో కలిసిపోతున్నాయి
అందుకే
పిడుగులు మైదాన ప్రాంతంలో పడుతున్నాయి
చీకటి కమ్మిన చోటు నుండే
వెలుగుపూలు పూస్తున్నాయి
ఆ పక్షులు సుదూర ప్రాంతాల నుండి వలస వచ్చినా
అవి ఎవరి స్వేచ్ఛని హరించలేదు
కానీ మీ పాద ముద్రలే
గాయానికి గుర్తుగా వున్నాయి.
గొంతులు విప్పలేని వారంతా
తమ నెలవులు నిలుపుకోవడం కోసం
కనుకొలకొల నుండి అగ్గిని రగిలిస్తున్నారు
ప్రకృతీ, ప్రకృతి జీవులూ యుద్ధ ప్రియులే.

కత్తి పద్మారావు